క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రామారావు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్‌గా నడిపేన రామారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఆయనను బదిలీ చేస్తూ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. విధులు చేపట్టిన రామారావుకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పూలగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

టెక్కలి: ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని బీజేపీ జిల్లా, నియోజకవర్గ నాయకులు ఎ.రవిబాబ్జీ, ఎన్.లక్ష్మీనారాయణ సూచించారు. టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో జె.పరమేశ్వరరావు, బి.నరేంద్రచక్రవర్తి, ఎస్.శ్రీను, రాంజీ, కామరాజు, జగన్నాథం పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై ఫిర్యాదు



జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న చిన్నారావు

సంతబొమ్మాళి: బోరుభద్ర గ్రామంలో ప్రభుత్వ భూమిని కొందరు వ్యాపారులు కబ్జా చేశారని స్థానికులు జిల్లా కలెక్టర్‌కు సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. స్థానిక సచివాలయ పరిధిలో ఉన్న సుమారు 40 సెంట్ల ప్రభుత్వ భూమిని గుడ్ల వైకుంఠరావు, గుడ్ల నరసింహామూర్తి ఆక్రమించి అడిగిన వారిపై దౌర్జన్యం చేస్తున్నారని స్థానిక నాయకుడు చింతాడ చిన్నారావు ఫిర్యాదులో పేర్కొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు పుస్తకాల వితరణ



పుస్తకాలను అందజేస్తున్న సతీష్‌కుమార్

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ విద్యార్థులకు అదే కళాశాలకు చెందిన అధ్యాపకుడు బి.సతీష్‌కుమార్ రసాయనశాస్త్ర పుస్తకాలను సోమవారం వితరణ చేశారు. తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైన ఈ పుస్తకాలను ఇటీవల సతీష్‌కుమార్ రచించారు. భవిష్యత్‌లో ఉపయోగకరంగా ఉండేందుకు పుస్తకాలను అందజేసినట్లు పేర్కొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ అప్పలస్వామికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సోంపేట: మండలంలోని కొర్లాం గ్రామ రెవెన్యూ పరిధిలోని అగ్రహారం చెరువు ఆయకట్టు సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరారు. ఈమేరకు తహసీల్దార్ బి.అప్పలస్వామికి స్థానిక రైతులు సోమవారం వినతి పత్రం అందజేశారు. చెరువు ఆయకట్టు పరిధిలో సుమారు 250 ఎకరాలు ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ భూములు తనకు వారసత్వంగా దక్కాయంటూ ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా జయంతపురం గ్రామానికి చెందిన క్రిష్ణచంద్ర పాడి ఇటీవల రెవెన్యూ అధికారులకు విన్నవించుకోవడం జరిగిందన్నారు. దీంతో సమస్య నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తరతరాలు సాగు చేస్తున్న భూములకు అడంగల్ కాపీలు తమపేరున వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ బస్సు సిబ్బందిపై ఫిర్యాదు

టెక్కలి: టెక్కలి నుంచి పూండి వైపు సోమవారం రాకపోకలు సాగించిన ఏపీ–29 జెడ్ 066 నంబర్ ఆర్టీసీ బస్సు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం గ్రామానికి చెందిన వి.గోపాలకృష్ణ కోరారు. ఈ మేరకు స్థానిక డిపో మేనేజర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. విపరీతమైన వర్షం పడుతున్న సమయంలో తమ పిల్లలతో పాటు మరికొంత మంది పిల్లలు గ్రామాలకు చేరుకునేందుకు బస్సు ఎక్కారని.. అయితే ఇది స్టూడెంట్ స్పెషల్ బస్సు కాదంటూ మార్గమధ్యలో కిందకు దింపేయడంతో పాటు నోటికి ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపించి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

అక్రమ వ్యాపారానికి అడ్డా!

- జోరుగా గంజాయి, సారా అక్రమ రవాణా
- సరిహద్దు గ్రామాల గుండా సరఫరా
- దాడులు చేస్తున్నా ఆగని దందా



పోలీసుల దాడిలో పట్టుబడిన గంజాయి (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: నిషేధిత పదార్థాల అక్రమ వ్యాపారానికి ఇచ్ఛాపురం సరిహద్దు గ్రామాలు అడ్డాగా మారాయనే ప్రచారం జరుగుతోంది. పోలీసులు దాడులు చేస్తున్నప్పటికీ దందాలు మాత్రం ఆగడం లేదు. కార్లు, లారీలు, బస్సులు ఇలా అవకాశం ఉన్న అన్నిరకాల వాహనాలను మత్తు పదార్థాలు తరలించేందుకు అక్రమార్కులు వాడేసుకుంటున్నారు. ముఖ్యంగా ఇచ్ఛాపురం సరిహద్దు ఒడిశా చీకటి బ్లాక్‌ను కేంద్రంగా మార్చుకొని అక్రమదారులుగా పిలిచే కేధారిపురం, జయంతిపురం, తూటుపురం, టి.బరంపురం, గుడ్డిభద్ర కొజ్జిరియా, పురుషోత్తపురం చెన్నై టు కోల్‌కత్తా రాకపోకలు సాగించే 16వ నంబర్ జాతీయ రహదారితో పాటు రైలు నిలయాలను కేంద్రాలుగా చేసుకొని గంజాయి, గుట్కా, నల్లమందు వంటి నిషేధ పదార్థాలతోపాటు నాటుసారాను తరలించడం నిత్య కృత్యంగా మారింది.

పాన్, టీ షాపులే అడ్డాగా..

అక్రమ వ్యాపారులు జాతీయ రహదారులను తమకు అనుకూలంగా మార్చుకున్నారు. రహదారి గుండా ప్రయాణించే లారీ డ్రైవర్లు, క్లీనర్లకు మత్తు పదార్థాలను అమ్మేందుకు పాన్ షాపులు, టీ షాపులను కేంద్ర బిందువుగా చేసుకొని రెండు చేతులా డబ్బును అర్జిస్తున్నారు. ఇచ్ఛాపురం జాతీయ రహదారిని ఆనుకొని పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద మహిళలు పాన్, టీ షాపుల్లో గంజాయి అమ్మకాలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతుంది. 2023 జూన్ 21వ తేదీ రాత్రి జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు దాడిచేసి సుమారు 100 కేజీల పైగా గంజాయిని, కేజీకి పైగా నల్ల మందును పట్టుకున్న సంఘటనను ఉదాహరణగా చెప్పవచ్చు. అలాగే ఈ నెల తొమ్మిదో తేదీన పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద గల ఓ షాపులో 25.560 కిలోల గంజాయి విక్రయిస్తున్న మహిళతో పాటు నలుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. గంజాయిని ఒడిశా సంతల్లో కొంతమంది వ్యక్తుల వద్ద కొనుగోలు చేస్తున్నామని, తమ షాపుల వద్ద లారీ డ్రైవర్లు, క్లీనర్లు కొనుగోలు చేస్తున్నారని పట్టుబడిన మహిళలు పోలీసులకు తెలియజేశారు. ఈ సంఘటన జరిగి వారం రోజులు తిరగముందే ఈనెల 14వ తేదీన స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద 11.070 కిలోల గంజాయితో కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఇద్దరు యువకులు పోలీసులకు పట్టుబడ్డారు. ఇదిలా ఉండగా, ఈనెల 15న ఒడిశా గంజాం జిల్లా మోహన గ్రామం నుంచి ఇద్దరు మహిళలు, ఒక యువకుడు 32.470 కేజీల గంజాయిని సూట్ కేసుల ద్వారా ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ నుంచి ముంబాయి వెళ్లేందుకు స్థానిక రైల్వే స్టేషన్‌లో ఉండగా పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. అలాగే అక్కడికి రెండు రోజుల తరువాత ఒడిశాకు రాష్ట్రం కొదలరాంపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ముంబాయికి మధ్యవర్తి ద్వారా సరుకును సూట్‌కేసు ద్వారా తరలిస్తున్న సంతోష్ సాహూ అనే వ్యక్తిని సోంపేట రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్ద 18.19 కేజీల గంజాయిని స్వాధీన పరుచుకున్నారు.

ఏరులై పారుతున్న సారా

ముఖ్యంగా నియోజకవర్గంలో ఒడిశా సరిహద్దు ప్రాంతాలు అధికంగా ఉండటంతో నాటు సారా ఏరులై పారుతోంది. ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం సెబ్‌ను ఎత్తివేయడంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. లాభార్జనే ధ్యేయంగా పలువురు వ్యాపారులు ఒడిశా సుమండీ నుంచి సముద్రంపై నాటు పడవలతో ఆంధ్రా తీర ప్రాంతాలకు, సమీప గ్రామాలకు తరలిస్తున్నారు. దాడులు చేపట్టాల్సిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో తగినంత మంది సిబ్బంది లేకపోవడం, పోలీసులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో సారా వ్యాపారం విచ్చలవిడిగా జరుగుతుంది.

అక్రమ వ్యాపారంలో మహిళల పాత్ర!

ఇప్పటి వరకు గంజాయి, నాటు సారా వంటి మత్తు పదార్థాలను అక్రమంగా తరలించేది పురుషులు మాత్రమే అనుకున్నాం. కానీ వ్యాపారులు మాత్రం మహిళల్ని ప్రత్యేకంగా ఎంచుకోవడం గమనర్హం. మహిళలైతే ఎవ్వరికీ అనుమానం రాదనే ఉద్దేశంతో మాఫీయా వారికి డబ్బును ఎరవేసి అక్రమ వ్యాపారానికి వినియోగించుకుంటున్నారు. సారా తరలింపులో ఈ మధ్య పోలీసులకు పట్టుబడిన వారిలో మహిళలే అధికంగా ఉండడం గమనార్హం.



జగన్నాథపురం వద్ద ఆంధ్రా–ఒడిశా సరిహద్దు

వరుస దాడులు చేస్తున్నాం



ఆంధ్రా, ఒడిశా సరిహద్దులను రవాణా కేంద్రాలుగా చేసుకొని కొంతమంది అక్రమ వ్యాపారాలు సాగిస్తున్న నేపథ్యంలో ముఖ్యకూడళ్లలో వరుస దాడులు చేస్తున్నాం. రైల్వే కూడళ్లలో నిఘా పెట్టాం. యువతకు పెద్ద మొత్తంలో డబ్బు ఆశ చూపి తెర వెనుక మాఫియా దందా సాగిస్తున్నట్టు సమాచారం ఉంది. కేసులు నమోదు చేసి అరెస్ట్‌లు చేస్తున్నాం. అనుమానం రాకుండా వ్యాపారులు మహిళలను సైతం బరిలోకి దింపుతున్నారు. ఇటువంటి అక్రమ వ్యాపారాలు సాగిస్తున్నట్లు పక్కా సమాచారం వస్తే తప్పకుండా నిలువరిస్తాం.

– మీసాల చిన్నంనాయుడు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఇచ్ఛాపురం

మాజీ మంత్రి సీదిరి పరామర్శ



వజ్రపుకొత్తూరు: పరామర్శలో అప్పలరాజు తదితరులు



కంచిలి: కొక్కిలిపుట్టుగలో జాదవ్ సాహు కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

వజ్రపుకొత్తూరు: పెద్దమురహరిపురం పంచాయతీకి చెందిన పలువురు ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సోమవారం పరామర్శించారు. పెద్దమురహరిపురం గ్రామానికి చెందిన గొరకల భారతి, జి.లక్ష్మణరావు, చిన్నమురహరిపురానికి చెందిన బొడ్డు తిరుపతిరావులు అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పలాస మాజీ ఎంపీపీ బి.హేమేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉంగ సాయిక్రిష్ణ, గొరకల రామారావు, జి.విశ్వనాథం, అమలపాడు సర్పంచ్ దున్న రత్నంబాలరాజు, కె.జోగారావు, కొండవూరు సర్పంచ్ కొల్లి భాస్కరరావు, సంగారు వైకుంఠరావు, దున్న శ్యామ్, కె.నారాయణ, కె.వెంకటేష్, బి.గణేష్, సైని ధర్మారావు కూడా పరామర్శలో ఉన్నారు.

కంచిలి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు ఇటీవల మృతిచెందారు. ఆయా కుటుంబాలను ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి పరామర్శించారు. కొక్కిలిపుట్టుగ గ్రామానికి చెందిన జాదవ్‌సాహు, నాతపుట్టుగ గ్రామానికి చెందిన డాలి దొలాయి, నారాయణబట్టి గ్రామస్తురాలు కిలుగు ఎల్లమ్మ చనిపోవడంతో వారి కుటుంబాలను పరామర్శించారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వి.మృత్యుంజయరావు, మండల జేసీఎస్ కన్వీనర్ కె.సురేష్, మండల పరిషత్ ఆహ్వానితుడు డి.ధర్మారావు, నేతలు లడ్డుకేశవ పాత్రో, అనాది దొలాయి, గంగాధర్ సాహు, వైస్ సర్పంచ్ బుడ్డెపు ఆనంద్ ఉన్నారు.

భారీ వర్షం–రైతన్న హర్షం

కవిటి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సోమవారం మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు మండలంలోని వివిధ ప్రాంతాల్లో భారీవర్షం కురిసింది. ఉత్తర కర్తరీ ప్రభావంతో గడచిన వారం రోజులుగా ఎండతీవ్రత, ఉక్కపోతతో బాధలు పడిన ప్రజలు ఒక్కసారిగా కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడడంతో సేదతీరారు. భారీ వర్షంతో కొబ్బరి, వరి రైతులు హర్షం వ్యక్తం చేశారు. వరిపైరు మరికొద్దిరోజుల్లో పొట్ట దశకు చేరుకుంటున్న తరుణంలో పడిన వర్షం ఎంతో మేలు చేకూరుస్తుందని రైతన్నలు సంబరపడుతున్నారు.



వర్షంతో కళకళలాడుతున్న బీలప్రాంత వరిపొలాలు

చేపల మార్కెట్ సముదాయం ప్రారంభం

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి చిన్నజజారులో నిర్మించిన చేపల మార్కెట్ సముదాయాన్ని రాష్ట్ర మంత్రి కె.అచ్చెన్నాయుడు సోమవారం ప్రారంభించారు. సుమారు రూ. 40 లక్షల అంచనా వ్యయంతో దీన్ని ఏర్పాటు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. టెక్కలి మేజర్ పంచాయతీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. అనంతరం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించారు. ఇన్‌చార్జి ఆర్డీవో కె.సుదర్శన్‌దొర, పంచాయతీ ఈవో కె.వి.వి.జగన్నాథం, పలువురు టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



మార్కెట్ సముదాయం ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

అవయవదాత కుటుంబానికి ఆర్థిక సాయం

సంతబొమ్మాళి:

చెట్లతాండ్ర పంచాయతీ గొల్ల సీతాపురం గ్రామానికి చెందిన అవయవదాత బొమ్మాళి బాలరాజు కుటుంబానికి అభయం సేవా సంఘం 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. టెక్కలిలో ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభంపై నుంచి పడి బాలరాజు బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో కుటుంబ సభ్యులు బాలరాజు అవయవాలను ఇటీవల దానం చేశారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న అభయం సేవా సంఘం సభ్యులు రూ. 50 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని మృతుని భార్యకు అందజేశారు. అలాగే ప్రముఖ చర్మవైద్య నిపుణులు డాక్టర్ లింగాల రమేష్ కూడా రూ. 10 వేలు విరాళమిచ్చారు. కార్యక్రమంలో అభయం యువజన సేవా సంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివసరావు, కార్యదర్శి లాడి కామేశ్వరరావు, ట్రెజరర్ శ్రీనివాస్ బెహర, సంఘ సభ్యులు ధర్మవరపు పూర్ణాచారి, పిల్లల రమేష్, అద్దాల వీరభద్రాచారి, ఉంగరాల గోవిందరావు, షణ్ముఖ పట్నాయక్, బోయిన నాగరాజు ఉన్నారు.



సాయాన్ని అందజేస్తున్న యువజన సంఘం సభ్యులు

ఆలయ ఆవరణ శుభ్రత

కంచిలి: కంచిలి ప్రాంత ప్రజల గ్రామదేవత కంచమ్మతల్లి ఆలయానికి వెళ్లే మార్గాన్ని పరిశుభ్రంగా ఉంచుదామని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంకల సోమేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆలయ మార్గాన్ని జేసీబీ సహాయంతో శుభ్రపరిచే ప్రక్రియను సోమవారం చేపట్టారు. ఈమార్గంలో స్థానికులు అపరిశుభ్రం చేయడం కారణంగా ఆలయానికి ఈ ప్రధాన మార్గం ద్వారా వచ్చే భక్తులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఎప్పటికప్పుడు కమిటీవారు శుభ్రపరిచినప్పటికీ, అదేతంతుగా స్థానికులు వ్యవహరించడంపైన తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఆ మార్గంలో ఉండేవారు క్రమశిక్షణగా మెలగాల్సిందిగా అంతా కోరుతున్నారు.



జేసీబీతో శుభ్రం చేస్తున్న దృశ్యం

టాలెంట్ టెస్టు పోస్టర్ ఆవిష్కరణ

కవిటి: దేశ అభివృద్ధిలో సైన్స్‌లో వచ్చే నూతన ఆవిష్కరణలకు విద్యార్థుల సృజనాత్మకతే కీలకమని కవిటి ప్రభుత్వ ఉన్నతపాఠశాల హెచ్‌ఎం బి.మల్లేశ్వరరావు అన్నారు. పాఠశాల ఆవరణలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ప్రజలలో మూఢనమ్మకాలను పారద్రోలి శాస్త్రీయ విజ్ఞానం, దృక్పథాన్ని పెంపొందించే దిశగా జేవీవీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జన విజ్ఞాన వేదిక సైన్స్ సంబరాల్లో భాగంగా చెకుముకి టాలెంట్ పరీక్ష టెస్టును పాఠశాల స్థాయిలో ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్నట్లు జేవీవీ కవిటి మండల కన్వీనర్ యు.గిరిబాబు తెలిపారు. పాఠశాల స్థాయిలో గెలుపొందిన వారికి అక్టోబర్ ఒకటో తేదీన మండల స్థాయిలో, 27న జిల్లాస్థాయి, నవంబర్ 9, 10 తేదీలలో రాష్ట్ర స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

ప్రజా ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

కాశీబుగ్గ: ఉద్యమాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఐ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ చిట్టిపాటి వెంకటేశ్వర్లు అన్నారు. మందస మండలం రట్టి గ్రామంలో శ్రీకాకుళం సాయుధ గిరిజన రైతాంగ పోరాట యోధురాలు పైల చంద్రమ్మ నాలుగో వర్ధంతి సభను సోమవారం నిర్వహించారు. న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్దానం ప్రజలకు ఉద్యమాల కొత్తకాదన్నారు. తీర ప్రాంతంలో మత్స్యకార సమస్యలు, ఉద్దానంలో పంటలకు గిట్టుబాటు ధర సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. ఇవి పరిష్కారం కావాలంటే ప్రజలందరూ మరోసారి పోరుబాట పట్టాలని పిలుపునిచ్చారు. ప్రజల కోసం ఆరు దశాబ్దాలు పోరుబాట పట్టిన చంద్రక్కను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ చేశారు. సభలో ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, కె.సోమేశ్వరరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్‌కుమార్, రైతు కూలీ సంఘం నాయకులు మామిడి భీమారావు, వంకల పాపయ్య, కుమార్, తాతారావు పాల్గొన్నారు.

చంద్రమ్మకు ఘననివాళి

కాశీబుగ్గ: కామ్రేడ్ పైలా చంద్రమ్మ పోరాట జీవితం, ఆమె తెగువ, త్యాగం మహిళాలోకానికి ఆదర్శనీయమని పలు ప్రజా సంఘాల నాయకులు అన్నారు. మున్సిపాలిటీ పరిధి సూదికొండలో సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో కామ్రేడ్ బాలక్రిష్ణ అధ్యక్షతన చంద్రమ్మ స్మారక సభ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమా, వివిధ సంఘాలకు చెందిన నాయకులు సార జగన్, రాపాక మాధవరావు, బర్ల గోపి, పోతనపల్లి మల్లిబాబు, హేమక్క, జానకమ్మ, అప్పయ్య, సూదికో కాలనీ ప్రజలు పాల్గొని విప్లవ జోహార్లు అర్పించారు.



రట్టి గ్రామంలో ర్యాలీ చేస్తున్న ప్రజాసంఘాల ప్రతినిధులు

నేడు కంచిలి మండల సమావేశం

కంచిలి: మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.నీరజ సోమవారం తెలిపారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించబోయే సమావేశానికి అన్నిశాఖల అధికారులు, సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

డ్రగ్ ట్రేడ్ అసోషియేషన్ అధ్యక్షుడిగా కృష్ణ



మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు కృష్ణ

సోంపేట: సోంపేట డ్రగ్ ట్రేడ్ అధ్యక్షుడిగా వజ్జ కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోంపేట పట్టణంలో డ్రగ్ ట్రేడ్ కార్యవర్గ ఎన్నికను సోమవారం నిర్వహించారు. సెక్రటరీగా సురేష్, ట్రెజరర్‌గా శ్రీనివాసరావు నియమితులయ్యారు. 50 సంవత్సరాలుగా డ్రగ్ ట్రేడ్ కార్యవర్గంలోఉండి డ్రగ్ ట్రేడ్‌నుంచి విశ్రాంతి తీసుకున్న సిందిరి క్రిష్ణరావు, పాండవ రిషికేశవరావులకు ఈ సందర్భంగా దుశ్శాలువలతో సభ్యులంతా సన్మానించారు. డ్రగ్ ట్రేడ్ సమస్యల పరిష్కారానికి తమవంతు కృషిచేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు పైడి శెట్టి రమేష్‌కుమార్, పెద్దింటి దుర్యోధన, తుంగాన వెంకటేష్, డాక్టర్ మంచుప్రదీప్ ఉన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజలో ఎమ్మెల్యే అశోక్, చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి 16, 21, 22 వార్డులో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బెందాళం అశోక్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మిలు సోమవారం భూమిపూజ చేశారు. 16వవార్డు ఫకీర్‌పేటలో రూ. 15 లక్షలతో సీసీరోడ్డు, 21, 22 వార్డుల్లో రూ.10 లక్షలతో సీసీడ్రైన్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, వైస్‌చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య, కూటమి నాయకులు దాసరి రాజు, ఆశి లీలారాణి, కె.దిలీప్ ఉన్నారు.

అమృత కలశం వితరణ

కవిటి: మండలంలోని రాజపురం గ్రామానికి చెందిన సత్యసాయి సంస్థల ఆధ్వర్యంలో సోమవారం రెండు గ్రామాలకు చెందిన ఇద్దరు పేదలకు సత్యసాయి అమృత కలశాల్ని వితరణ చేశారు. రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరకుల్ని సామాజిక సేవాకార్యక్రమాల్లో భాగంగా అందిస్తున్నట్టు ప్రతినిధులు తెలిపారు.

సంక్షిప్తంగా...

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

ఇచ్ఛాపురం: స్థానిక సీహెచ్‌సీలో పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం వైద్య పరీక్షలను నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బెందాళం అశోక్ ప్రారంభించారు. వైద్యులు పి.దేవేంద్రరెడ్డి, టి.శిల్ప, వైద్యసిబ్బంది దాసరి రాజు, ఎన్.జానీ పాల్గొన్నారు.

సేవా సమితి ఔదార్యం



సింహాచలానికి సాయాన్ని అందజేస్తున్న సేవా సమితి ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు: అమలపాడు గ్రామానికి చెందిన దున్న సింహాచలం బతుకు తెరువు కోసం రష్యా వెళ్లారు. పని చేస్తుండగా కళ్లు తిరిగి పడిపోవడంతో బ్రెయిన్‌లో రక్తం గడ్డకట్టినట్టు వైద్యులు నిర్ధారించారు. చికిత్స అందించినప్పటికీ నయం కాలేదు. నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పూండికి చెందిన యువతరం సేవా సమితి సభ్యులు అండగా నిలిచారు. రూ.10 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధితుడికి యువతరం సేవా సమితి సభ్యులు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు చింత మురళి, ఉపాధ్యక్షుడు కర్ని లింగరాజు, బి.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

చినవంకలో నేత్ర వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని చినవంక గ్రామంలో జిల్లా అంధత్వ నివారణ శాఖ, శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు రోగులకు పరీక్షించి మందులు అందజేశారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ హేమబాబు చౌదరి పాల్గొనాన్నరు.

6న ఉద్దానం కిడ్నీ విషాదాలు పుస్తకావిష్కరణ

కాశీబుగ్గ: వచ్చేనెల ఆరో తేదీన ఉద్దానం కిడ్నీ విషాదాలు పుస్తకావిష్కరణను కాశీబుగ్గలో నిర్వహిస్తున్నట్టు రచయిత, గిడుగు రామ్మూర్తి తెలుగు భాష, జానపద కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ద్రవిడియన్ విశ్వవిద్యాలయ మాజీ వీసీ, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషనర్ మాజీ ఇన్‌చార్జి చైర్మన్ ప్రొఫెసర్ కె.ఎస్.చలం ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు.

కోర్సుల పేరుతో వసూళ్లు తగదు

కాశీబుగ్గ: పిల్లలకు వివిధ కోర్సులు నేర్పిస్తున్నామని చెప్పి తల్లిదండ్రుల నుంచి పలు పాఠశాలల యాజమాన్యాలు వేలాది రూపాయలు ఫీజులుగా వసూలు చేయడం తగదని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ రవి అన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలాస ఆర్డీవో భరత్‌నాయక్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎటువంటి రిజిస్ట్రేషన్ లేకుండా, అర్హత లేని ఉపాధ్యాయులతో పలాస, సోంపేట, శ్రీకాకుళంలో పలు పాఠశాలలను నిర్వహిస్తున్నారని వినతిలో పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు పవన్, జస్వంత్, మని ఉన్నారు.

పాఠశాలలో వార్షిక తనిఖీ

ఇచ్ఛాపురం: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రయత్నించాలని మండల విద్యాశాఖాధికారి కె.అప్పారావు అన్నారు. పురపాలకసంఘం పరిధిలోని ముత్యాలమ్మపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో వార్షిక తనిఖీలను సోమవారం చేపట్టారు. ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. ఉపాధ్యాయులు కె.చంద్రశేఖర్, సుభాష్, ప్రకాష్‌రెడ్డి ఉన్నారు.

నేడు, రేపు 'పొలం పిలుస్తుంది'

సోంపేట: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొని రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వివిధ సేవలపై అవగాహన కల్పిస్తారన్నారు.

రాయితీపై పశుదాణా పంపిణీ

కోటబొమ్మాళి: నిమ్మడ గ్రామంలో పాడి రైతులకు రాయితీపై సమీకృత పశుదాణాను టెక్కలి వెటర్నరీ డీడీ వి.జయరాజ్ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. విడతల వారీగా అన్నిగ్రామాల్లోని పాడిరైతులకు పశుదాణాను అందజేస్తామని డీడీ జయరాజ్ తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, ఏడీ ఎం.లోకనాథం, కురుడు పశువైద్యుడు ఎల్.కిరణ్ కుమార్, వెటర్నరీ సహాయకులు ఎస్.శాంతారావు, కోట ధర్మారావు ఉన్నారు.

